www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 ఫిబ్రవరి 2024
5



5వ రోజుకు చేరిన ఆర్‌టిపిపి ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపి ఉద్యోగులు వేతనాల కోసం చేస్తున్న ధర్నా శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. ఆర్‌టిపిపిలోని అన్ని యూనియన్లు, అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఆర్‌టిపిపి పవర్ గేటు వద్ద ఉదయం 9 నుండి 10 గంటల వరకు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రతినెలా వేతనాలు చెల్లించడంలో ఆలస్యం అవుతోందని, ఐదు రోజులుగా ధర్నా చేస్తున్నా యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆర్థిక పరిస్థితులను, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారికి రావాల్సిన వేతనాలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మరో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్ష

రూ.6.5 లక్షల జరిమానా

ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి సంచలన తీర్పు

ప్రజాశక్తి - ముద్దనూరు

2016లో ఎల్ఎం కాంపౌండ్‌లోని చర్చిలో చోటు చేసుకున్న హత్య కేసుకు సంబంధించి శుక్రవారం ప్రొద్దుటూరు జిల్లా అదనపు కోర్టులో రెండవ అదనపు జిల్లా జడ్జి జి.ఎస్ రమేష్ కుమార్ సంచలన తీర్పు ఇచ్చారు. ఇద్దరికి యావజ్జీవ కారాగారం, మరో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు నైజ 5 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. సిఐ దస్తగిరి వివరాల ప్రకారం.. స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో 2016 ఫిబ్రవరి 7న చర్చి పెద్ద మనుషుల ఎన్నిక కోసం ఎన్నికలు నిర్వహించారు. అందులో బోనం రాజా రత్నం, బోనం సురేష్, బోనం అనిల్ కుమార్, బోనం రవి ప్యానల్ ఓటమి పాలయ్యారు. అంతకు ముందు వీరు చర్చికి పెద్ద మనుషులుగా ఉన్నారు. చర్చికి సంబంధించిన లావాదేవీలంతా వీరే చూసేవారు. ఎన్నికల అనంతరం అదే రోజు రాత్రి చర్చిలో గెలుపొందిన సభ్యులు, యవనస్తులు కలిసి ఓడి పోయిన వారిని చర్చి జమా ఖర్చులు, మిగులు డబ్బులు గురించి అడిగారు. 'మీకు ఎందుకు చెప్పాలిరా..' అంటూ బోనం రాజా రత్నం, బోనం సురేష్, బోనం అనిల్ కుమార్, బోనం రవి కలిసి అంటూ ముందుగా తెచ్చుకున్న కత్తులతో గెలుపొందిన వారిని దాడి చేశారు. కత్తుల దాడిలో యామవరం ఉదయ్ కుమార్ (27)అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఐదుగురు ఎర్రదాసరి సుధీకర్, దారా సురేష్ బాబు, పెళ్లకూరి విజయ్ కుమార్, బోనం రమేష్, బోనం ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడు బోనం ప్రశాంత్ ఫిర్యాదు మేరకు అప్పటి సిఐ రవిబాబు, ఎస్ఐ శ్రీనివాసులు బోనం సురేష్ -ఎ1 గాను, తేలు అశోక్ -ఎ2గానూ , బోనం అనిల్ కుమార్ - ఎ3 గానూ, బోనం రాజా రత్నంను ఎ4గాను , బోనం రవి ఎ6 గాను,బోనం దేవసహాయం, బోనం ధన రాజుపై కేసు నమోదు చేశారు. వీరిలో దేవసహాయం, ధనరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. 8 ఏళ్ల విచారణ అనంతరం శుక్రవారం ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి రమేష్ కుమార్ సాక్ష్యాలు పరిశీలించి నేరం రుజువు కావడంతో బోనం సురేష్‌కు రూ. 1.5 లక్షలు, బోనం రవికి జీవిత ఖైదు విధించి 1.5 లక్షలు జరిమానా విధించారు. మరో ముగ్గురు తేలు అశోక్‌కు మూడేళ్ల జైలు శిక్షణతో పాటు రూ.50 వేల జరిమానా, బోనం అనిల్ కుమార్ మూడేళ్లు జైలు శిక్ష, రూ. 2లక్షలు జరిమానా, బోనం రాజా రత్నంకు మూడేళ్ల జైలు శిక్ష ఒక లక్ష జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఐదేళ్లు కఠినగారా శిక్ష అనుభవించాలని తెలిపారు. సరైన సమయంలో సాక్షులను కోర్టుకు హాజరు పరచిన కోర్టు మానిటరింగ్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, ప్రొద్దుటూరు 3టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బ్రహ్మయ్య, ముద్దనూరు కోర్టు కానిస్టేబుల్ కె.రమేష్, డి.రమేష్ ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేశారన్నారు.

మెగా డిఎస్‌సిని విడుదల చేయాలి

డివైఎఫ్‌ఐ జిల్లా మాజీ కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్

ప్రజాశక్తి-కడప అర్బన్

వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన దగా డిఎస్‌సిని రద్దుచేసి మెగా డిఎస్‌సిని ప్రకటించాలని డివైఎఫ్‌ఐ జిల్లా మాజీ కార్యదర్శి బి.మనోహర్, డివైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. శుక్రవారం డివైఎఫ్‌ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న 25వేల పూర్తి పోస్టులతో మెగా డిఎస్‌సిని విడుదల చేయాలని పేర్కొన్నారు. డిఎస్‌సి పోస్టుల సంఖ్య పెంచి, నోటిఫికేషన్ సమయం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను భిక్షమెత్తేలా చేసిందని అన్నారు. డిఎస్‌సి పోస్టులు 25వేలుకు పెంచి మెగా విడుదల చేయాలని,117 జీవో రద్దు చేయాలని పేర్కొన్నారు. మెగా డిఎస్సీ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన వాగ్దానాన్ని అమలు చేస్తారని ఎదురు చూసిన వారికి తాజా ప్రకటన నిరాశపరిచిందని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, విద్యా అనుబంధ రంగాల పోస్టులన్నీ భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 10 లక్షలకు పైగా నిరుద్యోగులు బిఇడి, టిటిసి పూర్తి చేసి అప్పులు చేసుకొని కోచింగ్ తీసుకుంటూ సంవత్సరాలుగా ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందా అని ఎదురు చూస్తున్నారని వాపోయారు. సుదీ ర్ఘకాలంగా యువజన సంఘాలు, నిరుద్యోగ యు వత పోరాడిన ఫలితంగా కంటి తుడుపు చర్యగా 6,100 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారని, ఇది డిఎస్‌సి అభ్యర్థులను మోసగించే చర్య ని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సంఖ్యను చూసి లక్షలాది మంది యువత నిరుత్సాహం చెందుతున్నారని వాపోయారు. ప్రకటించిన డిఎస్‌సిలోనూ అనేక నిబంధనలు పెట్టారు. ఎప్పుడో రద్దు చేసిన అప్రెంటిస్ విధానాన్ని పునఃప్రవేశపెట్టి రెండేళ్ల గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో వివిధ రకాల ఉపాధ్యాయ పోస్టులు సుమారు 25 వేలు ఉన్నాయని, ఇవిగాక రానున్న జూన్‌లో మరిన్ని పోస్టులు ఖాళీ అవుతున్నాయని పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని మెగా డిఎస్‌సిని ప్రకటించాలని లేని పక్షంలో డివైఎఫ్‌ఐ గా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ మాజీ జిల్లా నాయకులు పి.వెంకటసుబ్బయ్య, పి.చంద్రారెడ్డి, నగర ఉపాధ్యక్షులు విజయ్ నాయకులు ఉదయ్, వెంకటరామయ్య, డిఎస్‌సి అభ్యర్థులు శ్రీనివాస్, శివ, జాన్, సుంకన్న, కిషోర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు, యువకులు

వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి-కాశినాయన


మండలంలోని అక్కేమ్‌గుండ్ల సావిశెట్టిపల్లె పొలాలలో వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి దాదాపు 7 బోర్లు వేసిన శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూముల్లో సర్వే నంబర్ 144/2లో 2-90, 144/3లో 4- 16, 45. 146 సర్వే నెంబర్లలో 15 సంవత్సరాల నుంచి పేదలు సాగు చేసుకుంటుంటే అలాంటి భూమిలో దౌర్జన్యంగా వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి ఎలాంటి రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఏడు మోర్లు వేసిన విషయంపై శుక్రవారం ఆయన విచారణ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆర్ఐ దక్షిణామూర్తితో అక్రమం గురించి చర్చించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా దౌర్జన్యంగా బోర్లు వేసిన శ్రీనివాసరెడ్డిపై వెంటనే కేసు నమోదు కోసం పోలీసులకు సిఫారసు చేయాలని కోరారు . దాదాపు ఈ ప్రాంతంలో 250 ఎకరాలు ఒకే వ్యక్తి ఆధీనంలో ఉండటం రెవెన్యూ అధికారులకు ఇది ఎంతవరకు న్యాయంగా కనిపించిందో వారే ఆలోచించుకోవాలన్నారు. 2018 సంవత్సరంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన భూ పోరాటానికి ఫలితంగా అప్పటి కలెక్టర్ ఆరుగురు తహశీల్దార్లతో విచారణ చేపట్టారు ఆ సందర్భంలో శ్రీనివాసులు రెడ్డి భూమి అంతా బోగస్ అని నిర్ధారణ కారండంతో కొన్ని సర్వే నెంబర్లను ఆన్‌లైన్‌లో తొలగించారని చెప్పారు. ఆ ఫైలు బయటకు తీస్తే జిల్లా అధికారులు వాస్తవాలు బయటపడతాయని చెప్పారు. పోలీసులతో మండల స్థాయి రెవెన్యూ అధికారులతో శ్రీనివాసరెడ్డి కుమ్మక్కయి పేద దళితుల పైన కూడా కేసులు బనాయించడానికి పోలీసులు సిద్ధపడ్డారన్నారు. భూ కబ్జాదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే బసనపల్లి గ్రామానికి చెందిన శ్రీను కూడా దాదాపు వందల ఎకరాల్లో భూకబ్జా చేశారన్నారు. వారం రోజుల కిందట తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు అన్నారు. భూ కబ్జాదారుని ఆధీనంలో ఉన్న భూ సర్వే నెంబర్ల అందరికీ నోటీసులు ఇచ్చి విచారణ చేసి బినామీ పట్టాల రద్దుచేసి పేదలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వీరయ్య నారాయణ పోలయ్య గురవయ్య బాబు కొంతమంది పేద బాధితులు పాల్గొన్నారు


ఆర్ఐకి వినతి పత్రం అందజేస్తున్న బాధితులు, సిపిఎం జిల్లా కార్యదర్శి

కార్యకర్తలను ప్రలోభ పెట్టడం తగదు : బిటెక్ రవి

ప్రజాశక్తి - వేంపల్లె

అక్రమంగా సంపాదించిన డబ్బులతో వైసిపి నాయకులు టిడిపి కార్యకర్తలకు ప్రలోభాలు పెట్టి కొనుగోలు చేస్తున్నారని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మేదర వీధిలో ఉన్న 50 ముస్లిం కుటుంబాలు టిడిపి ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా ఆధ్వర్యంలో టిడిపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు చెందిన మహిళలు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వైసిపికి చెందిన స్థానిక నాయకుడు హరిజనవాడ, రాజీవ్ నగర్ కాలనీలోకి వెళ్లి టిడిపి కార్యకర్తలకు రూ. 50 వేల నుంచి లక్ష వరకు డబ్బులు ఇచ్చి వైసిపిలోకి చేర్చుకున్నారని విమర్శించారు. జడ్‌పిటిసి వికుమార్ రెడ్డి చేష్టలు నచ్చకనే గతంలో నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జయచంద్రారెడ్డి, బాలకృష్ణారెడ్డి లాంటి నాయకులు టిడిపి పార్టీలో చేరారని గుర్తు చేశారు. ఉండేవారని కాపాడు కోవాలనే ఉద్దేశంతో డబ్బులుకు ప్రలోభాలు పెట్టుతున్నట్లు చెప్పారు. సతీష్ రెడ్డిని అభిమానించే వారు అందరూ టిడిపికి మద్దతు పలికాలని కోరారు. సతీష్ రెడ్డికి తమకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, డివి సుబ్బారెడ్డి, జయచంద్రారెడ్డి, రామగంగిరెడ్డి, జగన్నాథరెడ్డి, మహమ్మద్, మడక శ్రీనివాసులు, తెలంగాణ వలి, వీర భైరవరెడ్డి, నాగ సుబ్బయ్య, వీరబద్ర, రామాంజనేయురెడ్డి, జన సేనా ఇన్ ఛార్జ్ డాక్టర్ హరీష్, ఫయాజ్, పీరా సాహెబ్, డక్కా రమేష్ తో పాటు పలువురు టిడిపి నాయకులు, జన సేనా నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి

హైవే భూములు పరిశీలన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు నేషనల్ హైవే 440 నిర్మాణం కోసం అవసరమైన భూ సేకరణ పనులను శుక్రవారం జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పరిశీలించారు. రైతులు నష్టపోకుండా కచ్చితమైన భూ కొలతలు వేయాలని సూచించారు. హైవేకు సంబంధించి మొత్తం ఎంత భూమి పోతోంది, నష్టపరిహారం వంటి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్ర మంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి , ఎన్‌హెచ్ ఎఇ సురేంద్ర, సర్వేయర్లు పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వినియోగదారులకు నాణ్య మైన విద్యుత్‌ను అందించే ందుకు అవసరమైన ప్రాంతాలలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారి ఎస్.రమణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప, చింతకొమ్మదినెన్ని పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు, మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగటిపూట వీధి దీపాలు వెలగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ వృధాను, విద్యుత్ అరికట్టాలన్నారు. లక్ష్యాలను నిర్దశించుకుని పని చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, జూనియర్ ఇంజనీర్లు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతువన్న విద్యుత్ ఎస్ఇ రమణ

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రావని ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి పేర్కొన్నారు. కె.ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం వారి ఆధ్వర్యంలో శుక్రవారం కొప్పర్తి గ్రామంలో శుక్రవారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కె.సుజాత, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. జగదీశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో,రోడ్లకు ఇరు వైపుల ఉన్న కంప చెట్లను, చెత్తను తొలగించారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సుజాత, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీశ్వర్ రెడ్డి, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జె.సురేష్ బాబు, ఎన్.ఎస్.ఎస్ సిబ్బందితో పాటు వాలంటీర్లు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** పరిశ్రమలను పరిశుభ్రంగా ఉంచుదామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మోరగుడి గ్రామంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ఈనెల 15 వరకు ఉంటుందని చెప్పారు. విద్యార్థులలో మంచి విలువలు సత్ప్రవర్తన దేశభక్తి అలబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కే సంజీవరెడ్డి మరియు ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ ఎం సుధీర్ రెడ్డి , పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ రమణారెడ్డి ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా బీమా ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

రైతాంగ, కార్మికుల సమ్మెకు బీమా ఉద్యోగులు మద్దతు ఇస్తున్నామని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. దేశవ్యాప్త పిలుపు మేరకు డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం తొమ్మిది సంవత్సరాలలో చొరవ చూపలేదన్నారు. దేశంలో తొమ్మిదేళ్లలో లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. తాజా బడ్జెట్లో ఉపాధి కల్పనకు, కార్మికులకు కనీస వేతనాలకు సంబంధించి, పాత పెన్షన్ స్కీం పునరుద్ధరణకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు లేవన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధీకర్, యూనియన్ నేతలు వారిజాతమ్మ, రాజు, అయ్యవారు రెడ్డి, అమీనా పర్వీన్, శ్రీవాణి, కుమార్, జయచంద్ర, నరసయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతి పత్తి)లో శుక్రవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రియాజ్ విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను తెలియజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను 19 సంవత్సరాల లోపు ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, పి శివరామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసిల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

బిసిల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం వివేకానంద భవన్‌లో బిసి ల న్యాయమైన కోర్కెల సాధన కోసం జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో సుమారు 50 శాతంగా ఉన్న బిసిలు అన్నివిధాల వెనుకబడివున్నారు. వారందరూ అభివృద్ధి చెందడానికై మండల్ కమిషన్ రిపోర్టును యథాతధంగా అమలుచేయాలన్నారు. బి.సి కులగణను ఎన్నికల నోటిఫికేషన్ కు ముందే పూర్తి చేయాలన్నారు. బద్వేలు పట్టణంలో బి.సి భవనానికి ప్రభుత్వ స్థలం సంబంధిత రెవెన్యూ అధికారులు వెంటనే కేటాయించాలన్నారు.

అసెంబ్లీ, ఎంపీ స్థానాలు ముస్లిములకు కేటాయించాలి

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర శాసన సభలో అసెంబ్లీ, లోక్ సభ స్థానాలను ముస్లిములకు కేటాయించాలని ఎపి కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభా గపు ఉపాధ్యక్షులు మహ్మద్ ఆలీఖాన్ కోరారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎఐసిసి సమన్వయకర్తలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అలీఖాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలోని బిజెపి మతవిద్వేష పాలనలో ముస్లిం మైనార్టీలు చిత్రవధకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ముస్లిం మైనార్టీలను రాజకీయ బాధితులుగా పరిగణిస్తూ ఏఐసిసి ఓ తీర్మానాన్ని ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షుడు అక్రమ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నాసిరల్లి ఖాన్, కడప మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీఖాన్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ నేతలకు వినతి పత్రం అందజేస్తున్న అలీఖాన్

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి : ఎస్‌పి

కడప అర్బన్ : రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీస్ అధికారులు, సిబ్బంది సర్వసన్నద్ధం కావాలని, ఎలాంటి ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో కడప, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళికపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిటికల్(క్లిష్టతర / సమస్యా త్మక) పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్లు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. గ్రామస్తులతో సత్సంబంధాలు పెంపొందించుకుని సమస్యల గురించి ముందస్తు సమాచారం సేకరిస్తుండాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినపుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) లోసారి సుధాకర్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్, సిఐ లు, ఎస్ఐ లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు, స్పెషల్ బ్రాంచ్, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామాల్లో ఎంపీ పర్యటన

లింగాల : మండల పరిధిలోని పార్నపల్లి, వెలిదండ్ల గ్రామాల్లో శుక్రవారం కడప ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రూ. 2 కోట్ల నిధులతో పూర్తిచేసిన గ్రామ సచివాలయం, రైతు భరోసా, వైఎస్ఆర్ విగ్రహం, వైఎస్ఆర్ విలేజ్, హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. వైయస్సార్ విగ్రహం వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ తదితర వాటిని ప్రారంభించారు అనంతరం ప్రజలు ఎంపీకి వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వై.ఎస్ అభిషేక్‌రెడ్డి, ఓఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మిదేవి, సర్పంచులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అరెస్టు దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కడుపు కాలి వేతనాలు పెంచమని ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లను ప్రభుత్వం అరెస్టు చేయించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడ వెళుతున్న ఆశావర్కర్లను అరెస్ట్ చేసినందుకు వ్యతిరేకంగా శుక్రవారం సాయంత్రం రాజీవ్‌సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిభారం తగ్గించమని వేతనాలు పెంచమని ఆశావర్కర్లు విజయవాడకు ధర్నాకు వెళ్తుంటే వారిని ఈడ్చుకుంటూ తీసుకెళ్లడం అమానుష చర్య అన్నారు. పనిభారం తగ్గించి వేతనాలు పెంచమని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వం అమలు చేయకపోవడం కోర్టు తీర్పు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు. కార్మికులతో పెట్టుకున్న ప్రభుత్వాలు బతికి బట్టకట్టిన సందర్భాలు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్లకు వర్కర్లకు రూ.6500 ఇస్తూ రూ.10వేలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మోసపూరితం అన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందున సంక్షేమపథకాలు అందడంలేదన్నారు.కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి విజయకుమార్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, బాలసుబ్బయ్య, సంఘ అధ్యక్షులు ఎస్తేరురాణి, కౌసల్య రహణమ్మ, లక్ష్మి, మల్లేశ్వరి, తులసి, రామాంజనమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి

ఎమ్మెల్యే సోదరుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌పికి టిడిపి వినతి

ప్రజాశక్తి కడప అర్బన్

కడప ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా సోదరుడు అహమ్మద్ బాషపై చర్యలు తీసుకోవాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి, భూపేష్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఎస్‌పి కలిసి వినతి ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే తమ్ముడు పోలీస్ స్టేషన్ పై దాడి చేసి టిడిపి అరిపుల్లాను కొట్టడం, తన ఇంటికి వచ్చి దాడి చేస్తానని బెదిరించారని పేర్కొన్నారు. తాము చట్టాన్ని గౌరవిస్తామని, ఎమ్మెల్యే తమ్ముడు ఏం వ్యాఖ్యలు చేశారో ఆధారాలు ఉన్నాయని, ఎన్నికల్లో ఆయనను నగర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు.. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. **ప్రజలపై భారం మోపిన వైసిపిని గద్దె దింపాలి :** ప్రజలపై పెనుబారం మోపి, ప్రజలకు భారంగా మారిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిందేనని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. 9వ డివిజన్‌లో శుక్రవారం టిడిపి, జనసేన కలిసి నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ నిర్వహించారు. కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి, రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, జనసేన జిల్లా కో-ఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి, పథకాల లబ్ధి డివిజన్ స్థానిక ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఖాసిం, అంజి, సునీత, పలువురు మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నియోజకవర్గంలోని ప్రొద్దుటూరు మున్సిపాల్టీ, 2వ వార్డులో శుక్రవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని టిడిపి ఇన్ ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూరల్ మండలం కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, ప్రొద్దుటూరు పట్టణ వాణిజ్య విభాగ అధ్యక్షులు మిట్ట బాలచరణ్ కుమార్, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, రాజుపాలెం మండలం కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి , గోపవరం గగ్గుటూరి గౌస్ మొహిద్దిన్, భగత్ సింగ్ కాలనీ పట్నం మాబాషా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

విద్యార్థులకు విసి ప్రశంసలు

ప్రజాశక్తి- కడప అర్బన్

కేంద్రప్రభుత్వ గిరిజన వ్యవహారాల శాఖ నిర్వహించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల అధ్యాపక నియామక పరీక్షలో యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధక విద్యార్థులు ఓ.వెంకటయ్య (పిజిటి- తెలుగు), డా. కె.నరేష్ (టిజిటి- తెలుగు) ఉద్యోగాలు పొందారు. వీరిని విసి ఆచార్య చింతాసుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య యస్. రఘునాథరెడ్డి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య యస్. ఈశ్వరరెడ్డి, తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య జి. పార్వతి అభినందించారు. ఈ నెల12న విశాఖపట్నంలో జరిగే రోజ్‌గార్ మేళా ఆన్‌లైన్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోడీ నుంచి నియామక పత్రాలు పొందనున్నారు.



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రానున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి సమస్యలను గుర్తించాలన్నారు. ఫైనల్ నోటిఫికేషన్ రావడం వల్ల అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయా లేవా అని సంబంధిత అధికారులతో పర్యవేక్షించాలన్నారు. నాడు - నేడు పనులు ఎక్కడైనా బ్యాలెన్స్‌గా ఉంటే వాటిని పది రోజుల లోపల పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. పోలింగ్ స్టేషన్ల వద్ద మౌలిక సదుపాయాలు పైన కచ్చితంగా నిఘా ఉంచాలని తెలిపారు. అంతకుముందు జమ్మలమడుగు ఆర్‌డిఒ ఎ. శ్రీనివాసులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, జమ్మలమడుగు తహశీల్దార్ పాల్గొన్నారు.

విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలు మింగాలి

ప్రజాశక్తి - వేంపల్లె



విద్యార్థికి మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కడుపులో నులి పురుగుల నివారణకు ప్రతి విద్యార్థి అల్బెండజోల్ మాత్రలు మింగాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం అన్నారు. జాతీయ నూలి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని తాళ్ళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ అల్బెండజోల్ 400 ఎంజీ మాత్ర తీసుకోవడం వల్ల నులి పురుగులను నిర్మూలించవచ్చు అన్నారు. 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని చెప్పారు. 1 నుండి 2 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సగం మాత్ర పొడి చేసి శుభ్రమైన నీటితో కలిపి ఇవ్వాలని కోరారు. 3 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు మాత్రను నమిలి నీళ్లతో తీసుకోవాలని కోరారు. చేతులు శుభ్రంగా చేసుకొని ఆహారం తీసుకోవాలని లేకపోతే రోగాలు బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా మాత్రాలు పంపిణీ చేస్తారన్నారు. ఆరోగ్య విషయం పట్ల ప్రతి విద్యార్థి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ఉషాకిరణ్ పాఠశాలలో ఎంపిడిఒ సంపతి దివిజా, తాళ్ళపల్లె వైద్యురాలు స్వాతి సాయి విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దస్తగిరి, ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బి.ఎస్. రమణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బాల బాలికలలో రక్తహీనత నివారించేందుకు నులిపురుగులను నిర్మూలిద్దామని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు అన్నారు. శుక్రవారం మునిసిపల్ పరిధిలోని 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు పిల్లలకు నులిపురుగుల నివారణ మందును మింగించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** నూలి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల, చిలంకూరు జిల్లా పరిషత్ పాఠశాలలలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ రవిబాబు పరిశీలించారు. పాఠశాలల్లోని విద్యార్థులతో ఆల్బండ జోన్ మాత్రాలను మింగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, వైద్యులు శ్రీనాథ్ రెడ్డి, సుచరితా రెడ్డి,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ నాగ మునిరెడ్డి, సూపర్‌వైజరుడ్లు ఓబులేసు, సుభద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు :** మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిపిఎం శశిభూషణ్ హాజరయ్యారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి సునీత, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ , కావ్య మాధురి,, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు దేశానికే ప్రమాదకరం

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోడీ విధానాలు దేశ ప్రజానీకానికి చాల ప్రమాదకరమని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం వేంపల్లెలో కేంద్ర కార్మిక, రైతు,వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో 16న చేపట్టే గ్రామీణ బంద్ కరపత్రాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే గ్రామీణ బంద్,పారిశ్రామిక సమ్మెను ప్రజలందరూ జయప్రదం చేయాలని కోరారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరితాళ్లుగా మారినట్లు చెప్పారు. ఐదేళ్లల్లో 3 లక్షలమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. 4 లేబర్ కోడ్ వల్ల పరిశ్రమల్లో సంపద సృష్టించే కార్మికులను ఏ హక్కులు లేని బానిసలుగా మారారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర సంస్థలలో 23లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ దేశంలో యువతకు ఉద్యోగాలు లేక నిరుద్యోగ భారత్‌గా వెలిగిపోతున్నట్లు విమర్శించారు. కార్యక్రమంలో కెసి బాదుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు, ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి బాబ్ జాన్, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేశులు

ఓటర్ల జాబితా సిద్ధం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

నియోజకవర్గంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం ఓటర్ లిస్టు సిద్ధంగా ఉందని ఆర్‌డిఒ వెంకటేశులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ లిస్టు మార్పు , చేర్పులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి రాజకీయ పార్టీలోని నాయకులు సహకరించాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఓటర్ లిస్ట్ సిద్ధంగా ఉందని అందులోని పేర్లను చేర్చడానికి, తీసివేయడానికి ప్రస్తుతం తమకు అవకాశం లేదన్నారు. ఇప్పటినుంచి ఓటు నమోదు చేయాలన్న దానిని తీసివేయాలన్నా కూడా ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు రావాలని తెలియజేశారు. ఇంకా రాజకీయ పార్టీల నాయకులకు ఓటర్ లిస్ట్ పై ఏదైనా అనుమానాలు ఉన్న ఓటు తీసివేయడం లేదా ఓటు ఎక్కించడం వంటి వాటికి సంబంధించి ఏమైనా ఉంటే తగిన దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పులివెందుల తహశీల్దార్ రమేష్ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రైతులకు కరెంట్ కష్టాలు



- వ్యవసాయానికి విద్యుత్ కోత
- రెండు గంటలు కుదింపు
- ఏడు గంటలకే పరిమితం
- ఎల్ఆర్ పేరుతో ఇష్టానుసారంగా కోతలు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం వ్యవసాయ రంగానికి విద్యుత్తును రెండు గంటలు తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేయడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిరంతరాయంగా తొమ్మిది గంటల పాటు వ్యవసాయానికి సరఫరా చేసేవారు. రెండు రోజుల నుంచి విద్యుత్ వేళలను మార్చి వేయడంతోపాటు విద్యుత్ సమయం సైతం తగ్గించారు. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కేవలం ఏడు గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలు, అరటి, చీనీ ఇతరత్రా తోటలకు విద్యుత్ కోత వల్ల నీటి తడులను పంటలకు అందించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అటహాసంగా ప్రవేశపెట్టిన 9 గంటల విద్యుత్తును ఇవ్వకుండా కేవలం 7 గంటలు ఇవ్వడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు ప్రస్తుతం కోత దశలో ఉండడంతో నీటి తడులు అధికంగా అందించాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. ఈ దశలో విద్యుత్తు సమయాన్ని తగ్గించడం ఏమిటని వాపోతున్నారు. ఎల్ఆర్ పేరుతో విద్యుత్ కోతలు విధించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని అధికారులు చెబుతున్నప్పటికీ ఎల్ఆర్ (లోడ్ రిలీఫ్) పేరుతో మధ్యలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి 9 గంటలు నిరంతరాయంగా ఎలాంటి కోత లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.



స్పింక్లర్ల ద్వారా నీటి తడులు అందిస్తున్న రైతు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తగ్గింపు..

వ్యవసాయ రంగానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే విద్యుత్ సరఫరాను తగ్గించాం. తిరిగి ఆదేశాలు వస్తే యథావిధిగా గతంలో మాదిరి విద్యుత్ వ్యవసాయ రంగానికి అందిస్తాం.

- సుబ్రహ్మణ్యం, విద్యుత్‌శాఖ ఎఇ, సింహాద్రిపురం.

ప్రాంతీయ పార్టీలు బిజెపికి బానిసలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

మన రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన టిడిపి, జనసేన బిజెపి పార్టీకి బానిసలుగా మారినట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి నంబర్ వన్ ద్రోహి అని, అలాంటి పార్టీ కోసం వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు స్నేహం చేసేందుకు పోటీ పడుతున్నట్లు ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టిందని చెప్పారు. రాయలసీమకు ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలు ఇవ్వడంతో పాటు విభజన చట్టంలోని అంశాలను అమలు చేయలేదని విమర్శించారు. అటువంటి బిజెపి ప్రాపకం కోసం వైసిపి, టిడిపి, జనసేన పాకులాడడం శోచనీయం అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం రాబోవు ఎన్నికల్లో దుష్ట చతుష్టయ పార్టీలైన బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను రాష్ట్ర ప్రజలు ఓడించాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రాంతీయ పార్టీలకు ప్రత్యేక హోదా తేచ్చే శక్తి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఎపి ప్రత్యేక హోదా రావడంతో పాటు విభజన చట్టంలో అన్ని అంశాలు అమలు అవుతాయని చెప్పారు. పని భారం తగ్గించడంతో పాటు వేతనాలు పెంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆశా కార్యకర్తలు శాంతియుతంగా నిరసన చేస్తుంటే వారి పట్ల వైసిపి ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గం అన్నారు. ఆశా కార్యకర్తల డిమాండ్లను పరిష్కారించాలని కోరారు.

విభజన హామీల సాధనకు మలిదశ ఉద్యమం

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు మరిచిన కేంద్ర ప్రభుత్వానికి,విభజన హామీలు కోసం పోరాటం లో నిర్లక్ష్యం వహించిన రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్ష పార్టీలకు రాబోవు ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు కోసం శుక్రవారం ఢిల్లీలో ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో మాజీ సిబిఐ జెడి లక్ష్మీనారాయణ అధ్యక్షతన చలసాని శ్రీనివాసరావు, రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల, విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా పాల్గొని రాయలసీమకు పాలకులు చేస్తున్న నిర్లక్ష్యం పై శివకుమార్ ప్రసంగించారు. తరతరాలుగా వెనుకబడిన రాయలసీమకు పాలకులు అన్యాయం చేస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రులను ఇచ్చిన రాయలసీమను పట్టించుకోవడం మానేశారని విమర్శించారు. విభజన సమయంలో కడప ఉక్కు ఇస్తామని, బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని చెప్పి నేటికి దాదాపు పదేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని బిజెపి నిలదీయాలనే అన్న ఆలోచన అధికార, ప్రతిపక్ష పార్టీ వైసిపి, టిడిపికి లేదన్నారు. ఆ దిశగా బిజెపి, బిజెపికి మద్దతు ఇస్తున్న రాష్ట్రంలోని వైసిపి, టిడిపికి వచ్చే ఎన్నికలలో యువత, ప్రజలు తగిన రీతిలో ఓటు ద్వారా బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని ఎంపిడిఒ సంపతి దివిజా అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2 సందర్భంగా శుక్రవారం వేంపల్లెలోని 5వ సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య కిట్లును ఎంపిడిఒ, ఎంపిపి లక్ష్మి గాయత్రీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా రోగాలతో బాధపడే రోగులకు స్పెషలిస్ట్ వైద్యుల చేత వైద్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. దీర్ఘ, స్వల్పకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు చాలా ఉపయోగ పడుతుందని చెప్పారు. రోగులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులు జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లపల్లె వైద్యులు స్వాతిసాయి, స్పెషలిస్ట్ వైద్యులు రమణయ్య, శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపిడిఒ జ్ఞాన సుందరమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పి. బొమ్మేపల్లిలో జగనన్న సురక్ష 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. 367 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మహేంద్ర రెడ్డి. మెడికల్ ఆఫీసర్స్ తస్మియా తస్లీమ్, స్థానిక డాక్టర్, ఎఎన్ఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష మందులు పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ

నేడు కడప ఉక్కు కోసం భూపేష్ పాదయాత్ర

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

నేడు 'కడప ఉక్కు మన హక్కు' పేరుతో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సి. భూపేష్ రెడ్డి పాదయాత్రలో యువత పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి కోరారు. జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రూట్ మ్యాప్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ పేరుతో నియోజకవర్గంలోని ప్రజలను, యువతను పెద్ద ఎత్తున మోసం చేసిందన్నారు. కడప ఉక్కుతో ఇక్కడ యువత భవిష్యత్తు మారుతుందని అది ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తకు ఉందన్నారు. ఉక్కు సాధనలో భాగంగా మన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడప ఉక్కు మన హక్కు అనే సంకల్పంతో శనివారం పాదయాత్రను చేస్తున్నారన్నారు. ఉదయం ఏడు గంటలకు నారాపుర స్వామి దేవాలయంలో ప్రారంభమై, అంబ భవాని దేవాలయం, కూరగాయల మార్కెట్, గాంధీ బొమ్మ సర్కిల్, ట్యాంక్ వీధి, ఎత్తపువారి కాలనీ, కన్నెలూరు, గోరిగనూరు, ధర్మాపురం, దానవు లపాడు, సున్నపురాళ్లపల్లె, సిరిగే పల్లె, పెద్దదండ్లూరు గ్రామం వరకు పాద యాత్ర ఉంటుందన్నారు. పెద్దదండ్లూరులో సాయంత్రం ఐదు గంటలకు బహిరంగ సభ ఉంటుందని జయప్రదం చేయాలని కోరారు.

దాతృత్వం అభినందనీయం

ప్రజాశక్తి- కలసపాడు

మండలంలోని హృదయ పేటలో విభిన్న ప్రతిభావంతుడు బాబుకు పోరుమామిళ్ల చిత్తా బ్రదర్స్, మదర్ తెరేసా ఫౌండేషన్ వారి సహాయ సహకారాలతో కిరాణా కొట్టును బంకును ఏర్పాటుచేసి ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చిత్తా, మరియరాని, గిరి ప్రణీత్ రెడ్డి , కలసపాడు సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్ రెడ్డి, విదేశీయులు అభినందనీయులని పలువురు ప్రశంసించారు. శుక్రవారం అతిథులు దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం మదర్ థెరిసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిత్త రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన సుమారు 67 మంది నిరాశ్రయులకు మదర్ థెరిసా ఫౌండేషన్ ద్వారా వివిధ రకాల రూపంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. వారు మానసికంగా బాధపడకుండా తిరిగి సమాజంలో ఆనందంగా సంతోషంగా ఉండేందుకు ద వస్తువులను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి రమేష్, ప్రసాద్, గ్రామ పెద్దలు ఓబులేష్, అంతోని, సిద్దయ్య, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కెఒఆర్ఎంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

కడప అర్బన్ : కెఒఆర్ఎం కళా శాలలో టాప్ అకాడమీ, బెంగ ళూరు వారు శుక్రవారం ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహి ంచారు. టాప్ అకాడమీ రిసోర్స్ పర్సన్స్ హర్షిత్, రవి డ్రైవ్‌లో భాగస్వా ములయ్యారు. 150 విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష, గ్రూప్ డిస్క షన్, టెక్నికల్ రౌండ్ నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 11 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యా ర్థులు వేమా కీర్తన, రే వంత్‌రెడ్డి, వసుమతి, మస్తాన్‌బి, లిఖిత, మొహమ్మద్ థోఫిక్, వెంకట మేఘన, మౌ నిక, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌కి చెందిన సాయి కార్తికేయ, రమ్య శ్రీ, యోగేశ్వర్ రెడ్డి ఎంపికయ్యారు. వీరికి మొదటి 6 నెలలపాటు రూ.70 వేలు విలువైన ఉచిత శిక్షణను లేటెస్ట్ టెక్నాలజీస్ ఫుల్ స్టాక్ డెవలప్మెంట్, పైథాన్, ఇతర టెక్నాలజీస్‌లో నిష్ణాతులను చేసి ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీస్‌లో ఎంపిక కావడానికి సపోర్ట్ చేయడానికి వీలవుతుందని కళాశాల కరస్పాండెంట్ లిఖిత రెడ్డి అన్నారు.



గండి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు అందుకుంటున్న డిఇఒ దంపతులు

గండి అంజన్నను దర్శించుకున్న డిఇఒ

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామిని శుక్రవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారి ఎం అనురాధ కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి ఉద్యోగోన్నతిపై ఆర్‌జెడిగా బాధ్యతలు చేపట్టడంతో ఆయన స్థానంలో నంద్యాలలో ఎడిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కడప జిల్లా డిఇఒ అనురాధ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గండి వీరాంజనేయస్వామి ఆలయ కమిటీ, అర్చకులు మర్యాదలతో వారికి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు జి.శివారెడ్డి, బొజ్జ రంగారెడ్డి, దాదా పీర్, పిట్ట వెంకటరమణ, కృష్ణ కుమార్, ధర్మారెడ్డి, సుమలత పాల్గొన్నారు.

జనసేన నాయకులకు అండగా ఉంటా

ప్రజాశక్తి-దువ్వూరు

జనసేన నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని నాయకులు పాశం లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ కాళికామాత ఆలయానికి రూ. 2.70 లక్షలు విలువ చేసే గ్రానైట్ చప్పట వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతనమైన గుడి మరమ్మతులలో భాగంగా పుట్టిన ఊరికి తన వంతు సేవగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మైదుకూరు నియోజక వర్గం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, డాక్టర్ తిరుమలరావు, జనసేన నాయకులు అంద్రోతు రామచంద్రుడు, పాశం కొండయ్య, రామమోహన్, జయరామ్, రమణ పాల్గొన్నారు

దళితులకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించండి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దళితులకు అవకాశం కల్పించాలని పార్టీ అధిష్టానాన్ని పాలాజి చిన్న వెంకట స్వామి విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ (ఆంధ్ర రత్న భవనం) కార్యాలయంలో పాలాజి చిన్న వెంకటస్వామి ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడు తూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎస్‌సి, ఎస్టఇ, బిసి, మైనార్టీలు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. పై వర్గాల వారికి టిక్కెట్ ఇస్తే బాగుంటుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఏ దళితుడు ఎమ్మెల్యే కాలేదని దళితులందరు ఆసంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈసారి తనకు పార్టీ అవకాశం ఇస్తే పార్టీ గెలుపు కోసం శాయశక్తులా కష్టపడి పనిచేస్తానని ఆయన తెలిపారు.. చివరికి పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రకాశం పాల్గొన్నారు.



పశువులను పరీక్షిస్తున్న డాక్టర్ సుదర్శన్‌రెడ్డి

62 పశువులకు వైద్య చికిత్సలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మైత్రాయపల్లిలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ రిలయన్స్ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్న గురువలూరు పశువైద్య అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆరు బయటకు వదలాలన్నారు. ఉచిత పశు వైద్య శిబిరం ద్వారా పశువులకు పరీక్షలు చేసి మందులు అందించామన్నారు. ఈ వైద్య శిబిరంలో 182 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 18 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 36 దూడలకు 78 గొర్రెలకు నట్టాల నివారణ మందులు 48 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 250 కోళ్లకు గోమారి నివారణ మందులు, తెగుళ్ళకు యాంటీబయాటిక్ మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది లక్షుమయ్య ,బి రమేష్ బాబు, డి శివ, రామ్మోహన్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి అమీర్ పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను గెలిపించుకుందాం

పులివెందుల రూరల్ : వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని మున్సిపల్ ఇన్‌ఛార్జ్ వై.ఎస్. మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పెద్దరంగాపురం సచివాలయ పరిధిలోని జయమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వారికి విపులంగా తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను ప్రతి ఇంటికి పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజుల్లా , మున్సిపల్ కమిషనర్ రమణ రెడ్డి , కో - ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.